## క్లుప్తంగా

### ఆంధ్రా క్రికెట్ జట్టుకు సాహితిశ్రీ ఎంపిక



దేవరపల్లి: స్థానిక ఏఎస్సార్ జెడ్పీ హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థిని ఓరుగంటి సాహితిశ్రీ అండర్–15 మహిళల ఆంధ్రా క్రికెట్ జట్టుకు ఎంపికైంది. అక్టోబరు 21 నుంచి 30 వరకూ విజయనగరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్‌లో ప్రతిభ కనబరచిన ఆమె అండర్ –15 మహిళా ఆంధ్ర క్రికెట్ జట్టుకు ఎంపికైనట్టు ఆ హైస్కూల్ పీడీ నాగరాజు శుక్రవారం తెలిపారు. ఈ నెల 21 నుంచి 29 వరకూ కటక్‌లో నిర్వహించే జాతీయస్థాయి టోర్నమెంట్‌లో ఆంధ్రా జట్టుకు సాహితిశ్రీ ఆడుతుందని ఆయన తెలిపారు. గతేడాది డిసెంబర్‌లో దేవరపల్లి మండలం పల్లంట్ల జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్–17 రాష్ట్ర టోర్నమెంట్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టుకు సాహితిశ్రీ కెప్టెన్‌గా వ్యవహరించింది. ఈ టోర్నీలో ఆ జట్టు మూడో స్థానం సాధించినట్టు తెలిపారు. జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికైన సాహితిశ్రీని హెచ్ఎం బి. శ్రీలక్ష్మి, పీఎంసీ చైర్మన్ వేముల రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

### రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు చాగల్లు బాలిక



రోషినిని అభినందిస్తున్న వ్యాయామోపాధ్యాయిని

చాగల్లు: అండర్ –17 రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జి.రోషిని ఎంపికైంది. ఏలూరులో గత నెలలో నిర్వహించిన జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ బాలికల ఎంపిక పోటీల్లో రోషిని పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. దాంతో ఆమెను రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టుకు రోషిని ఎంపికైనట్టు హెచ్ఎం పి.వీర్రాజు శుక్రవారం తెలిపారు. ఈ నెల 9 నుండి విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో రోషిని పాల్గొంటుందని ఆయన తెలిపారు.ఆమెను పీడీ విజయలక్ష్మి అభినందించారు.

### విద్యుత్ శాఖ ఏఈగా శ్రీనివాస్



గోపాలపురం: విద్యుత్ శాఖ గోపాలపురం ఏఈగా దూసనపూడి శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఏడాదిగా ఈ పోస్టు ఖాళీగా ఉంది. ఇప్పటి వరకూ ఏడీఈ కె.రవిశంకర్ అదనంగా ఈ బాధ్యతలు నిర్వహించారు. శ్రీనివాస్ నిడదవోలులో కన్‌స్ట్రక్షన్ ఏఈగా విధులు నిర్వహించారు. అక్కడి నుంచి బదిలీపై గోపాలపురం ఏఈగా నియమించినట్టు ఏడీఈ రవిశంకర్ తెలిపారు.

### ఆస్పత్రిలో గుర్తు తెలియని మహిళ మృతి



మహిళ మృతదేహం

నిడదవోలు: చికిత్స పొందుతూ 45 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని మహిళ శుక్రవారం రాత్రి మృతి చెందింది. గత నెల 25న అనారోగ్యంతో గుర్తు తెలియని మహిళ నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరింది. మెరుగైన వైద్యం కోసం ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్టు పట్టణ ఎస్సై పి.శోభన్‌కుమార్ తెలిపారు. చామన ఛాయ రంగులో ఉన్న ఆ మహిళ బంగారు రంగు ఎంబ్రాయిడరీ డిజైన్‌తో ఉన్న ముదురు పింక్ కలర్ గాగ్రా డ్రెస్, ఎడమ కాలికి ఎరుపు, నలుపు రంగు గలిగిన పూసల తాడు ధరించి ఉంది. మృతురాలి వివరాలు తెలిసినవారు నిడదవోలు పట్టణ ఎస్సై 9440796661 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

### ఆర్టీసీ ఉద్యోగుల యూనియన్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

నిడదవోలు: ఆర్టీసీ నిడదవోలు డిపో ఉద్యోగుల యూనియన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా తాడిమల్ల శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడిగా జనసేన పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రంగా రమేష్, కార్యదర్శిగా ఎండీ మోహిద్దీన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ముస్తఫా, కోశాధికారిగా ఎస్. సత్తిబాబు, అదనపు కార్యదర్శిగా అప్పారావుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

# పాముల బడిలోనే పాఠాలు

- యర్నగూడెం జెడ్పీ హైస్కూల్లో విష సర్పాల సంచారం
- వణికిపోతున్న విద్యార్థులు
- ఆవరణను కప్పేసిన ముళ్లపొదలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ముళ్లపొదల మధ్య యర్నగూడెం జెడ్పీ హైస్కూల్ వాష్ రూమ్‌లు



ముళ్లపొదలతో నిండిన యర్నగూడెం జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానం

దేవరపల్లి: విషసర్పాల మధ్య బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు పాఠాలు వల్లె వేస్తున్నారు. ఎటువైపు నుంచి ఎప్పుడు విషసర్పం తరగతి గదిలోకి ప్రవేశిస్తుందోనని మండలంలోని యర్నగూడెం బొల్లిన గంగరాజు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది భయంతో వణికిపోతున్నారు. మూడు నెలలుగా ఈ పాఠశాల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉంది. అయినప్పటికీ పాలకులు గాని, అధికారులు గాని పట్టించుకోవడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. హైస్కూల్ చుట్టూ ముళ్లపొదలు, గడ్డి పెరగడంతో విషసర్పాలు తిరుగుతున్నాయని వారు వివరించారు. బడికి పిల్లలను పంపాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. విద్యార్థులకు, క్రీడాకారులకు నిత్యం విషసర్పాలు తారస పడుతుండడంతో వారుభయంతో పరుగులు తీస్తున్నారు. ఈ హైస్కూల్ ప్రాంగణంలో హైస్కూల్‌తో పాటు అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాల కూడా ఉన్నాయి. దాదాపు 600 మంది విద్యార్థులు, 50 మంది ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు. హైస్కూల్ ప్రాంగణంలోని వాష్‌రూమ్‌లు ముళ్లపొదలతో నిండి ఉన్నాయి. వాష్‌రూమ్‌కు వెళ్లాలంటే విద్యార్థులు భయపడుతున్నారు.ఈ పాఠశాల క్రీడా ప్రాంగణంలో కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. నీళ్లు నిలిచిపోయి, ముళ్లపొదలతో క్రీడాప్రాంగణం నిండి ఉంది. హైస్కూల్ ఆవరణ చిన్నపాటి అడవిలా తయారైంది. పాఠశాలకు దక్షిణం వైపున చెరువు ఉండడం, స్కూలులోని వర్షపునీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో ఈ సమస్య ఉత్పన్నం అవుతోందని యర్నగూడెం గ్రామస్తులు తెలిపారు. పాఠశాల్లోని వర్షపు నీరు బయటకు వెళ్లేల డ్రైనేజీ నిర్మించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చేపట్టి, ముళ్లపొదలను తొలగించి విష సర్పాల బారి నుంచి తమను కాపాడాలని పాలకులను, అధికారులను విద్యార్థులు కోరుతున్నారు.



అంగన్‌వాడీ చిన్నారుల చెంత ఏపుగా పెరిగిన గడ్డి

#### విద్యార్థులను రక్షించాలి



పాఠశాల ప్రాంగణం పూర్తిగా ముళ్లపొదలు, గడ్డితో నిండి ఉంది. పాములు తిరుగుతున్నాయి. పిల్లలు భపడుతున్నారు. హైస్కూల్‌కు వెనుక ఉన్న చెరువు చుట్టు పక్కల గడ్డితో నిండి ఉండడం వల్ల పాములు వస్తున్నాయి. స్కూలు పరిసరాలు మొత్తం అడవిలా ఉంది. విషయాన్ని ఉన్నతాధికారులు, గ్రామపెద్దలు, పంచాయతీకి చెప్పాం. ప్రస్తుతం గడ్డి మందు కొట్టిస్తున్నాం. చెరువు చుట్టూ ఉన్న ముళ్లపొదలను తొలగించాలి. గ్రామస్తులు, అధికారుల సహకారంతో సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

– వి. చంద్రరావు, హెచ్ఎం, బొల్లిన గంగరాజు జెడ్పీ హైస్కూల్, యర్నగూడెం

#### తాచుపాములు తిరుగుతున్నాయి



హైస్కూల్ ప్రాంగణం చిట్టడవిలా ఉంది. క్రీడా మైదానం పూర్తిగా ముళ్లపొదలు, గడ్డితో నిండి ఉంది. వాష్ రూమ్‌లను ముళ్లపొదలు కప్పేశాయి. పొదల్లో పాములు సంచరిస్తున్నాయి. రెండు రోజుల్లో రెండు తాచు పాములను చంపారు. అంబేడ్కర్ యూత్ ద్వారా ప్రస్తుతానికి క్రీడా ప్రాగణంలో గడ్డి మందు పిచికారీ చేస్తున్నాం. అధికారులు, గ్రామస్తులు పట్టించుకుని సమస్యను సత్వరమే పరిష్కరించాలి. పాములను చూచి విద్యార్థులు భయపడుతున్నారు.

– చిరంజీవి, అంబేడ్కర్ యూత్ సభ్యుడు, యర్నగూడెం

## కోళ్లఫామ్ వ్యర్థాలతో పంటలకు నష్టం

అధికారులకు ఫిర్యాదు చేసిన తాడిపర్రు కౌలుదారులు

ఉండ్రాజవరం: కోళ్లఫామ్ వ్యర్థాలు పంట బోదెలో కలవడం వలన తాము పంటలను నష్టపోతున్నామని మండలంలోని తాడిపర్రుకు చెందిన కౌలుదారులు వాపోతున్నారు. పదేళ్లుగా తాము ఈ ఇబ్బందిని ఎదుర్కొంటున్నామని, పంటలు దెబ్బతిన్నందున కౌలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గ్రామానికి చెందిన సుమారు 20 మంది కౌలుదారులు సాగు చేస్తున్న భూములకు నీటిని అందించే పంట బోదెలో పౌల్ట్రీఫారం వ్యర్థాలు కలుస్తున్నాయి. పౌల్ట్రీ యాజమానికి ఎన్నిసార్లు చెప్పినా, అర్ధరాత్రి ఆ వ్యర్థాలను పంట కాలువలోకి వదిలేస్తున్నారని రైతులు తెలిపారు. వారు శుక్రవారం ఈ సమస్యను ఏవో విశ్వాసరావుకు ఫిర్యాదు చేశారు. ఆయన వచ్చి పంట బోదెలోని వ్యర్థాలను పరిశీలించారు. ఈ సమస్యను మార్టేరు రైతు పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలకు తెలియజేస్తామని, వారు వచ్చి పంటలను పరిశీలించి, పరిష్కార మార్గాలు చూపుతారని ఏవో రైతులకు చెప్పారు. సమస్యపై స్పందించిన తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ వ్యర్థాలను వదులుతున్న పౌల్ట్రీఫారాన్ని రైతులతో కలసి సందర్శించారు. రైతుల నుంచి ఫిర్యాదును స్వీకరించి సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కరిస్తామన్నారు.

## అన్నవరప్పాడులో 11 గంటల పాటు విద్యుత్ కోత



అన్నవరప్పాడులో వెలగని లైట్లు

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడులో శుక్రవారం పగలంతా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మరమ్మతుల పేరుతో ఉదయం 8 గంటలకు సరఫరాను నిలిపివేసిన విద్యుత్ శాఖ అధికారులు రాత్రి 7 గంటలకు పునరుద్ధరించారు. ఈ సమయంలో గ్రామంలోని ఎక్కడ లైన్ల మరమ్మతులు చేశారో తెలియదు కానీ, ఓ వ్యక్తి షెడ్డు నిర్మాణం కోసం సరఫరాను నిలిపివేశారనే విమర్శలు వచ్చాయి. ఈ విషయం తెలిసి తాము అధికారులకు ఫోన్‌లు చేసి సరఫరా ఎప్పుడిస్తారంటూ ప్రశ్నిస్తే 'లైన్‌లు బాగుచేస్తున్నాం. మరో పావుగంటలో ఇచ్చేస్తాం' అంటూ సమాధానం వచ్చిందని పలువురు విద్యుత్ వినియోగదారులు ఆరోపించారు. సాయంత్రం 4 గంటల నుంచి అధికారుల ఫోన్‌లు కూడా పనిచేయలేదని వినియోగదారుల ఆరోపణ. దీనిపై సాయంత్రం 6 గంటలకు 'సాక్షి' పెరవలి సబ్‌స్టేషన్ ఏఈ డేవిడ్ నిశ్చల్‌కు ఫోన్ చేసినా లైన్‌లు మరమ్మతులు చేస్తున్నామనే సమాధానం వచ్చింది. ఎక్కడ చేస్తున్నారని ప్రశ్నిస్తే ఆయన స్పష్టంగా బదులివ్వలేదు. ఇదే విషయాన్ని 'సాక్షి' ట్రాన్స్‌కో ఈఈ అప్పారావుకు ఫోన్ చేస్తే 'ఇప్పటి వరకూ కరెంట్ ఇవ్వలేదా.. నేను చెబుతాను' అంటూ సమాధానం చెప్పారు. ఇలా కాలయాపన చేశారే తప్ప రాత్రి ఏడింటి వరకూ కరెంటు మాత్రం ఇవ్వలేదు. ఉదయం నుంచీ కరెంటు లేకపోవడంతో సామాన్యులతో పాటు చిరువ్యాపారులు, కోళ్ల రైతులు, ఇబ్బందులు పడ్డారు. కరెంట్ లేక హోటల్స్ కూడా మూసికోవాల్సి వచ్చిందని హోటల్స్ యజమానులు తెలిపారు. టిఫిన్లు కావాలంటే పిండి, చట్నీలు రుబ్బాలి కదా అందుకే మూసివేసి కూర్చున్నామని వాపోయారు.

## గ్రామీణుల ఆరోగ్య రక్షణ మన బాధ్యత

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సంధ్య



అచ్చన్నపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టరు సంధ్య

నల్లజర్ల: గ్రామీణుల ఆరోగ్యాన్ని కాపాడడంలో వైద్యులు, వైద్య ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సంధ్య సూచించారు. శుక్రవారం ఆమె మండలంలోని పలు గ్రామాల్లో వైద్య,ఆరోగ్య శాఖ కార్యక్రమాలను పర్యవేక్షించారు.అలాగే అచ్చన్నపాలెంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలాచోట్ల ఎన్సీడీ వ్యాధులు బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోందన్నారు. వయసుతో సంబంధం లేకుండా బీపీ, షుగర్, బ్రెయిన్ స్ట్రోక్, గుండెపోటు బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోందన్నారు. ఎవరికి ఏవ్యాధి ఉందో తెలుసుకోవడంలో జరుగుతున్న జాప్యం ప్రాణాల మీదకు తెస్తోందన్నారు. దీనిపై త్వరలో ఇంటింటా సర్వే కార్యక్రమం జరపనున్నట్టు డాక్టర్ సంధ్య చెప్పారు. క్యార్యక్రమంలో డాక్టర్ సిరాజుద్దీన్, సీహెచ్‌ఓ ప్రసాద్, ఆరోగ్య కార్యదర్శి సీహెచ్ జ్యోతి, ఎంఎల్‌హెచ్‌పీ పి.మణి, 104 సిబ్బంది అశోక్, ఆశా కార్యకర్త ఇందిర, ఆరోగ్య సహాయకులు జీవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

## కంసాలిపాలెంలో నవగ్రహ ప్రతిష్ఠాపన



నవగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు రూరల్: కంసాలిపాలెం గ్రామంలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామివారి ఆలయంలో శుక్రవారం ఘనంగా నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో హోమాలు, ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. అనంతరం నిర్వహించిన భారీ అన్న సమారాధనకు పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు హాజరయ్యారు. జనసేన మండలశాఖ అధ్యక్షుడు పోలిరెడ్డి వెంకటరత్నం, ఆలయ కమిటీ సభ్యుడు కొండపల్లి అచ్యుత రామారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వివేకానంద భక్తి సమ్మేళనం సభ ప్రారంభం

నిడదవోలు: వివేకానందుని ప్రసంగాలు, రామకృష్ణ పరమహంస జీవన విధానాన్ని బాల్యంలోనే అధ్యయనం చేస్తే భవిష్యత్తు బంగారుమయం అవుతుందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే మధ్యాంధ్ర శ్రీ రామకృష్ణ–వివేకానంద భావ ప్రచార పరిషత్ ఐదో భక్తి సమ్మేళనం సభ శుక్రవారం పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో ప్రారంభమైంది. రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రి దుర్గేష్‌ను స్వామీజీలు సత్కరించారు. స్వామీజీలు శితికంఠానంద మహరాజ్, పరిజ్ఞేయానంద మహరాజ్, సేవ్యానంద మహరాజ్‌లు ప్రసంగించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, స్వామీజీలు, మాతాజీలు, రామకృష్ణ సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

## ఐపీపీబీ ఖాతాలు తెరచేందుకు ప్రత్యేక శిబిరాలు

కొవ్వూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల పేర్లతో లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా సొమ్ములు జమ చేసేందుకు తపాలా శాఖ చర్యలు తీసుకుంటోందని తాడేపల్లిగూడెం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.కృష్ణ శుక్రవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, తపాలా శాఖ సంయుక్తంగా ఇందుకోసం ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు (ఐపీపీబీ) ఖాతాలను ఈ నెల 15 వరకూ తెరిచేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. స్థానిక జిల్లా యంత్రాంగం సహకారంతో గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిల్లో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నారు. డివిజన్‌లో నిరుపయోగంగా ఉన్న 2.50 లక్షల ఖాతాలను పునరుద్ధరించడంతో పాటు కొత్త ఖాతాలను తెరుస్తారు. డివిజన్‌లోని 229 పోస్టాఫీసుల ద్వారా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కృష్ణ చెప్పారు.

## ఇసుక లావాదేవీలు అడ్డుకుంటే కఠిన చర్యలు

- జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు
- వాడపల్లి, ఎరినమ్మ రీచ్‌ల ఆకస్మిక తనిఖీ



కొవ్వూరు మండలంలో ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు

కొవ్వూరు: డీ సిల్టేషన్, ఓపెన్ రీచ్‌ల వద్ద ఇసుక లావాదేవీలకు ఎవరైనా ఆటంకం కలిగించినా, సొమ్ములు డిమాండ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు హెచ్చరించారు. కొవ్వూరు డివిజన్ పరిధిలోని వాడపల్లి, ఎరినమ్మ ఇసుక రీచ్‌లను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ రీచ్ పాయింట్ వద్ద గల బోట్స్‌మన్ సొసైటీ సభ్యులతో నేరుగా మాట్లాడారు. మరింత సమర్థవంతంగా ఉచిత ఇసుక పాలసీ పని చేయడం ముఖ్యమన్నారు. చాలినంత ఇసుక వినియోగదారులకు అందుబాటులో ఉండేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుందని తెలిపారు. ఇసుక సరఫరాకు ఏ విధంగా ఆటంకం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం నుంచి మరో ఎనిమిది ఇసుక రీచ్‌లను అందుబాటులోకి తీసుకుని వచ్చినట్టు చెప్పారు. ఇసుక రవాణా కోసం ముందుకు వచ్చిన ఎల్ వన్ బిడ్స్ వేసిన ఏజెన్సీస్ కార్యకలాపాలు నిర్వహించాలని, ఒకవేళ సకాలంలో పనులు ప్రారంభించక పోతే ఎల్–2కు కేటాయించనున్నట్టు జాయింట్ కలెక్టర్ తెలిపారు. అనుమతులు జారీ చేసిన 24 గంటల్లో కార్యకలాపాలు ప్రారంభం కావాలన్నారు. ఆఫ్ లైన్, ఆన్‌లైన్ ద్వారా ఇసుకను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ట్రాక్టర్ ద్వారా ఇసుక తీసుకుని వెళ్లే వారికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట కొవ్వూరు తహసీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

**రైతుల వివరాలు పక్కాగా నమోదు చేయాలి**

నిడదవోలు రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల వివరాలు పక్కాగా నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం రైతుసేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తులకు, ఓపెన్ మార్కెట్‌కు అమ్మిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో బ్లాక్ చేసి అవి ప్రభుత్వం కొనుగోలు చేసే ధాన్యంలోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యం శాంపిల్స్ పరిశీలించారు. అనంతరం మండలపరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ, వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, అగ్రికల్చరల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

**ఇసుక ఉచితమే.. ఎవరైనా తీసుకు వెళ్లొచ్చు**

పెరవలి: ఇసుక కావాల్సిన వారు ఆయా పంచాయతీ కార్యదర్శులు లేక వీఆర్వోలు ఇచ్చే ధ్రువీకరణ పత్రంతో ర్యాంపుల నుంచి ఉచితంగా ఇసుక తీసుకెళ్లవచ్చని నరసాపురం ఆర్డీవో దాసిరాజు తెలిపారు. శుక్రవారం ఆయన తీపర్రు ర్యాంపును సందర్శించారు.మండలంలోని తీపర్రులో ఇసుక ర్యాంప్‌లో రీచ్–2గా గుర్తించి పశ్చిమ గోదావరి జిల్లాకు కేటాయించారని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ ఇసుక తవ్వకాలు ముమ్మరంగా చేపట్టారని తవ్విన ఇసుకను గుట్టలుగా వేసి వచ్చే వాహనాలకు అందిస్తారని తెలిపారు. ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా తీసుకెళ్లవచ్చని లారీలు మాత్రం గుట్టల నుంచే తీసుకువెళ్లాలని స్పష్టం చేశారు. ఇందు కోసం 20 టన్నుల ఇసుక లారీకి ప్రభుత్వానికి రూ.1924 లు చెల్లించాలని స్పష్టం చేశారు. అదనంగా ప్రాంతాన్ని బట్టి కిరాయి ఉంటుందని తెలిపారు. అదే విధంగా తీపర్రు రీచ్–3 గా గుర్తించామని దీనిని కాకినాడ జిల్లాకు కేటాయించారని తెలిపారు. లోకల్‌గా ఉండే పెరవలి మండలానికి ఎక్కడా ర్యాంప్ కేటాయించకపోవటం కొసమెరుపు. పెరవలి తహసీల్దార్ డి.అచ్యుతకుమారి, పెనుగొండ తహసీల్దార్ అనిత, తణుకు, తాడేపల్లిగూడెం తహసీల్దార్లు పాల్గొన్నారు.

## పాదయాత్ర చేస్తున్న భక్తులను ఢీకొన్న లారీ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంసాని మంగమ్మ




లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

నల్లజర్ల: కార్తిక మాసం సందర్భంగా పాదయాత్రగా ద్వారకాతిరుమల వెళుతున్న ఇద్దరు మహిళా భక్తులు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వెనుక నుంచి వస్తున్న లారీ వారిని ఢీ కొట్టింది. అనంతపల్లి హైస్కూల్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు మహిళల స్వగ్రామం చాగల్లు మండలం చిక్కాల. వారిలో సంసాని మంగమ్మ (50) పరిస్థితి విషమంగా ఉండడంతో ఆమెను రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. నల్లజర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు**

విజయవాడ నుంచి విశాఖ వెళుతున్న ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేయబోయి ఢీ కొట్టింది. ఈ ప్రమాదం శుక్రవారం తెల్లవారుజామున అనంతపల్లి హైస్కూల్ సమీపంలోని ఫ్లైఓవర్‌పై జరిగింది. నిద్రమత్తులో ఉన్న ప్రయాణికులందరూ ఒక్కసారిగా ఉలిక్కి పడి లేచారు. ఎవరికీ గాయాలు కాకపోవడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది వచ్చి ప్రయాణికులను వేరే బస్సులో వారి గమ్యస్థానాలకు పంపించారు. బస్సును పక్కకు తొలగించే క్రమంలో ఆ బస్సు స్టీరింగ్ రాడ్ విరిగి ఉంది. అదే ముందుకు వెళ్తే మరో పెద్ద ప్రమాదం సంభవించేదే.

## ప్రజాపోరు వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నిడదవోలు: ప్రజా సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో శనివారం నుంచి ఈ నెల 14 వరకూ సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజాపోరు వాల్ పోస్టర్లను శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సెంటర్లో ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ ఈ సందర్భంగా పట్టణంలో కరపత్రాలను పంపిణీ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జువ్వల రాంబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పెనుభారాలు మోపుతున్నాయన్నారు. ధరలు హద్దూ అదుపు లేకుండా నిత్యావసరాల ధరలు పెరగడంతో సామాన్య మధ్యతరగతి ప్రజల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుందరబాబు, శేఖర్, వెంకటరావు, లక్ష్మణరావు, పద్మనాభం, రాము తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

## ఉచిత కంటి శస్త్ర చికిత్సలకు 22 మంది

తాళ్లపూడి: స్థానిక రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహించిన కంటి వైద్య శిబిరాల్లో 22 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని వైద్యులు గుర్తించారు. వారిని శుక్రవారం కంటి ఆపరేషన్ల నిమిత్తం శుక్రవారం నిడదవోలు తరలించినట్టు తరలించినట్టు నేత్ర వైద్యుడు నాగరాజు తెలిపారు. తెల్ల రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు కలిగి ఉన్న వారికి ఖర్చులు లేకుండా బస్సుల్లో తీసుకువెళ్లి ఆపరేషన్ల అనంతరం మళ్లీ తీసుకు వస్తామన్నారు.

## నేడు, రేపు ప్రత్యేక ఓటర్ల నమోదు

దేవరపల్లి: ఈనెల 9,10 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి శుక్రవారం సాయంత్రం తెలిపారు. మండలంలోని 67 పోలింగ్ కేంద్రాల వద్దా ఓటర్ల నమోదు జరుగుతుందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్ కేంద్రాల వద్ద బూత్‌స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఓటు నమోదు, తొలగింపు, సవరణ, ఆధార్ కార్డుతో ఓటరు ఐడీ కార్డుకు లింకేజీకి వీలుగా దరఖాస్తులు స్వీకరిస్తారని ఆమె తెలిపారు.

నల్లజర్ల: ఫొటో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణలో శని, ఆదివారాల్లో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు కృష్ణారావు కోరారు. 2025 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలన్నారు. పేరు మార్పులు, చేర్పులు, డెత్‌లు, డబుల్ ఎంట్రీలు పరిశీలించి ఫారం–6, ఫారం–7, ఫారం–8 ద్వారాసవరణ చేస్తారన్నారు.